క్లుప్తంగా

బ్రేకులు పడక..

ఆటోట్రాలీ బోల్తా

ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు



బోల్తాపడిన ట్రాలీ ఆటో

చేవెళ్ల: పూలలోడ్‌తో వెళ్తున్న ఆటోట్రాలీ బోల్తా పడింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగడపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పులుసుమామిడి గ్రామానికి చెందిన ఖాజాపాష(37) ఈ ఘటనలో మృతి చెందాడు. కొమరయ్య, సందీప్‌రెడ్డి, మల్లారెడ్డి, దేవయ్య, రంగారెడ్డిలు పూలను సాగు చేశారు. అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి ట్రాలీ ఆటోలో నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు తరలిస్తున్న క్రమంలో తంగడపల్లి సమీపంలోకి రాగానే ఆటో బ్రేక్‌లు పనిచేయకపోవడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, మిగితవారు స్వల్పంగా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని పలు ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆచారి గెలుపు కోసం పూజలు

మాడ్గుల: కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి గెలవాలని ఆమనగల్లు వేంకటేశ్వర ఆలయంలో ఇర్విన్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ మెజార్టీ సాధించాలని వారు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజురెడ్డి, శ్రీశైలం, రమేశ్, అశోక్, మల్లేశ్, హరిశ్, భూపేశ్, గణేశ్, శేఖర్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్



భీంభరత్‌ను కలిసిన శేరిగూడ గ్రామస్తులు

షాబాద్: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనపై ప్రజలు విసిగి మార్పు కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, కొమరబండ గ్రామస్తులు తదితరులున్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపు ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని శేరిగూడ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో పోలింగ్ జరిగిన తీరును ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. మైలా రం శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మైసమ్మ జాతర

కడ్తాల్: మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ జాతర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆరురోజుల పాటు భక్త జనసందోహం మధ్య కొనసాగిన ఉత్సవాలను ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలి, నాయకులు రామవత్ భాస్కర్‌నాయక్, అరుణ్ కుమార్, యాదగిరిస్వామి, చంద్రయ్య, దేవేందర్, బోడ్యా, రమాదేవి ఆలయ అర్చక సిబ్బంది భక్తులు ఉన్నారు.



అలంకరణలో మైసమ్మతల్లి

వామ్మో.. చలి!

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన స్వెటర్ల వినియోగం
- జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్న వైద్యులు



మంచుతో నిండిన జాతీయ రహదారి (ఫైల్)

షాబాద్: జిల్లాతో పాటు మండలంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. ఉదయం చలిగాలులు వీస్తుండడంతో రోడ్లపై చీకటిగానే ఉంటుంది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలిబారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున చలి తీవ్రత మరింత అధికంగా ఉండడంతో రోడ్ల వెంబడి, ప్రధాన వీధుల్లో కొందరు చలి మంటలు వేసుకోవడంతో పాటు స్వెటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో వ్యాధులు ధరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిని తీసుకోవాలని, చలిలో తిరగాల్సి వస్తే చెవులు, ముక్కు కప్పుకునేలా ఉన్ని దుస్తులు, మంకీ క్యాప్ ధరించాలి.
- వేడి, వేడిగా ఉండే ఆహార పదార్థాలనే తీసుకోవాలని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. శీతల పానీయాలు ఐస్‌క్రీంలు, ఇతర చల్లటి పానీయాలకు దూరంగా ఉండడం మేలు. స్వీట్లు ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిది.
- చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. తల్లిపాత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.

అప్రమత్తతే మేలు..



రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ముఖ్యంగా అస్తమా, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా బయట తిరగొద్దు. ఏడాదిలోపు పిల్లలు ఉండే గదిని వేడిగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా స్వెటర్లు, మాస్కులను ఉపయోగించాలిలేందటే నిమోనియా బారిన పడే అవకాశం ఎక్కువ.

–డాక్టర్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

ప్రయాణం చే యాల్సి వస్తే శరీరాన్ని పూర్తిగా కప్పేసి ఉంచాలి.

- అస్తమా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు, స్వెటర్లు ధరించడం ఉత్తమం.
- చలికాలంలో శరీరం పొడిబారకుండా నువ్వుల నూనెను స్నానానికి ముందు ఒంటికి రాసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం



మొయినాబాద్‌రూరల్: బాకారం సమీపంలో ఏర్పడిన గుంత



మొయినాబాద్‌రూరల్: మధ్యలోనే వదిలేసిన రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో జనం
- కొత్తూరులో మరమ్మతు పనులకు నోచుకోని కేజీబీవీ రహదారి

మొయినాబాద్‌రూరల్: రోడ్డు అభివృద్ధి కోసం నిధులు మంజురైన అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం వెరసి బాకారం రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ప్రమాదాలకు నిలయంగా తయారైంది. రెండు సంవత్సరాల క్రితం ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. కానీ సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్కెపల్లి–బాకారం రోడ్డు విస్తీర్ణ పనులకు రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2022, మార్చిలో మంత్రి ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. అంతరాష్ట్ర రహదారి నుంచి ఎన్కెపల్లి మీదుగా బాకారం వరకు ఈ రోడ్డు పనులు నిర్మించాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ ఈ పనులు సక్రమంగా చేయకపోవడంతో ఇక్కడి జనం అసంతృప్తిగా ఉన్నారు. దీంతో వాహనాదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతరాష్ట్ర రహదారి ఎన్కెపల్లి చౌరస్తా నుంచి ఎన్కెపల్లి గ్రామ శివారు వరకు రోడ్డు పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారని పేర్కొంటున్నారు. ఎన్కెపల్లి మొదలుకొని బాకారం వరకు రోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో ఈ రోడ్డు గుంతల మయంగా మారి నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులను పూర్తి చేయించేవిధంగా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలకేంద్రం నుంచి కస్తుర్బాగాంధీ బాలికల హాస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును మరమ్మతు పనులు చేయాలని కొత్తూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న హాస్టల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా లైట్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు స్థానికులు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో, రాత్రి వేళల్లో హాస్టల్‌కు వెళ్లేందుకు, అక్కడి నుంచి పట్టణానికి వచ్చేందుకు విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఈ పనులను శరవేగంగా చేపట్టాలని స్థానికులు కోరారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను శనివారం షాద్‌నగర్ బీజేపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు హైదరాబాద్ వెళ్లి ఈటల రాజేందర్‌ను కలిశారు. అనంతరం షాద్‌నగర్‌లో జరిగిన పోలింగ్ తీరును ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు బీజేపీని ఆదరిస్తారనే నమ్మకం ఉన్నట్లు వారు తెలిపారు. బాబయ్య గెలుపు తథ్యమని నాయకులు ఈటల రాజేందర్‌తో చెప్పారు. ఈటలను కలిసిన వారిలో చెట్ల వెంకటేష్, అశోక్, కుడుముల బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.



ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ ప్రాంతానికి చెందిన శ్రీలత(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన సోదరి అరుణజ్యోతి ఇంటి సమీపంలో నివాసం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీలత బయటికి వెళ్తున్నానని తల్లికి చెప్పింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో సోదరి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవితవ్యం తేలేది నేడే

- 12టేబుళ్లు, 22 రౌండ్లు
- గండిపేట లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఉదయం 8గంటలనుంచి ప్రారంభం



ఓట్ల లెక్కింపు కేంద్రం లార్డ్ ఇంజనీరింగ్ కళాశాల

షాద్‌నగర్: ఎన్నికల రణరంగంలో చివరి ఘట్టం రానే వచ్చింది. ప్రజా తీర్పు ఎటు వైపు ఉంటుందోనన్న విషయం కొద్ది గంటల్లో తేలనుంది. ఎన్నికల బరిలో నిలబడి పోటా పోటీగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థుల భవితవ్యంపై ప్రజా తీర్పు వెలువడనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ గండిపేట మండలం హిమాయత్‌సాగర్ సమీపంలోని లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరగనుంది.

ప్రజా తీర్పు ఎటు వైపో..

షాద్‌నగర్ అసెంబ్లీ స్థానానికి 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రతీ సారి ఈ ప్రాంత ప్రజలు విలక్షణమైన తీర్పును ఇస్తున్నారు. అయితే ఈసారి జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఈ సారి ప్రజా తీర్పు ఎటు వైపు ఉంటుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ..

ఈ సారి ఓట్ల లెక్కింపు గండిపేట సమీపంలోని లార్డ్స్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. షాద్‌నగర్‌తో పాటు, చేవేళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ అక్కడే నిర్వహించనున్నారు.

కౌంటింగ్‌కు తరలివెళ్లేందుకు నేతలు సిద్ధం..

కౌంటింగ్ కేంద్రం షాద్‌నగర్‌కు సమీపంలో ఉండడంతో అన్ని పార్టీల నేతలు అక్కడికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల్లో గెలుస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

12గంటలలోపే ఫలితాలు..

కౌంటింగ్‌కు సంబంధించి మొత్తం 13 టేబుళ్ల ఏర్పాటు చేశారు. 12 టేబుళ్ల కౌంటింగ్ కోసం, ఒక టేబుల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 22 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. ఒక్కో రౌండ్‌లో సుమారు 9వేల ఓట్లు లెక్కించనున్నారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ అనంతరం ఈవీఎంలలోనివి లెక్కించనున్నారు. షాద్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మధ్యాహ్నం 12 గంటలలోపే పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

సిద్ధాపూర్ నుంచి మొదలు..

మొదట కొత్తూరు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రం ఒకటి నుంచి సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ఓట్లను లెక్కించనున్నారు. కొత్తూరు, నందిగామ మండలాల తర్వాత కొందుర్గు, చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్ చివరగా షాద్‌నగర్ పట్టణంలోని ఓట్లను లెక్కించనున్నారు.

ఫలితాలపై ఉత్కంఠం..

నందిగామ: ఎన్నికలు ముగిశాయి. ఇక గెలుపు ఎవరిదో అనే చర్చ కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు వస్తాయని పలు సర్వేలు వెల్లడించిన నేపథ్యంలో షాద్‌నగర్‌లో ఏవిధంగా ఫలితం రాబోతుందోనని అభ్యర్థుల్లో ఉత్కంఠత పెరుగుతుంది.

జోరుగా బెట్టింగులు..

అటు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం రానుందనే విషయంపై షాద్‌నగర్‌లో కూడా ఎవరు గెలుస్తారనే దానిపై గ్రామ స్థాయినుంచి జోరుగా బెట్టింగులు కొనసాగుతుందని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన నాయకులే కాకుండా, యువత కూడా ఈ బెట్టింగుల్లో జోరుగా పాల్గొంటున్నారు. ఏ నలుగురు వ్యక్తులు కలిసిన ఎన్నికల ఫలితాల గురించే చర్చించుకుంటున్నారు.

విజయం ఎవరిని వరించేనో?

- హోరాహోరీగా సాగిన పోరు
- కొద్ది గంటల్లో తేలనున్న విజేతల వివరాలు

మొయినాబాద్: హోరాహోరీగా సాగిన చేవెళ్ల పోరులో విజయం ఎవరిని వరించబోతుందో మరి కొన్ని గంటల్లో తేలనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతుందోనని నేతల్లో నెలకొన్న ఉత్కంఠకు కొన్ని గంటల్లోనే తెరపడనుంది.

కారు దూసుకెళ్లేనా..

బీఆర్ఎస్ ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థుల ప్రకటన చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకే మళ్లీ టికెట్ కేటాయించింది. అప్పటి నుంచే ఆయన నియోజకవర్గంలో ముమ్మర ప్రచా రం చేశారు. ఇది ఇలా ఉండగా ఈ సారి కాంగ్రెస్ గాలి వీస్తుందని ముందునుంచే ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కారు దుసుకెళ్తుందా! అని బీఆర్ఎస్ నాయకులే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హస్తం హవా కొనసాగుతుందా..

చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అనే పేరుంది. చేవెళ్లలో ఎక్కువ సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ఉన్న కాలె యాదయ్య 2014లో కాంగ్రెస్ నుంచే గెలుపొందారు. తరువాత బీఆర్ఎస్‌లో చేరి 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఈసారి కాంగ్రెస్ పామెన భీంభరత్‌కు అవకాశం ఇచ్చింది. పదేళ్లుగా అధికారం లేక కసితో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు చేవెళ్లలో గెలుపుకోసం కష్టపడి పనిచేసినట్లు తెలుస్తుంది.

కమలం వికసిస్తుందా..

గతంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఎప్పుడూ గట్టి పోటీ ఇవ్వలేదు. ఈ సారి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కమలం కండువా కప్పుకుని బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. దీంతో చేవెళ్లలో కమలం వికసిస్తుందని మొదటి నుంచి ఆ పార్టీ శ్రేణులు గట్టి నమ్మకంతో పనిచేశాయి. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నా అసలు విజేత ఎవరో కొద్ది గంటల్లోనే తేలనుంది.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

వనస్థలిపురం: గణేశ్ టెంపుల్ రోడ్డు, రైతుబజారు కూడలిలో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో పలువాణిజ్య కేంద్రాలు, ఆలయాలు ఉండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. రైతుబజారు చౌరస్తాలో వనస్థలిపురం నుంచి సుష్మ చౌరస్తా, బీఎన్‌రెడ్డినగర్ వైపు నుంచి, హయత్‌నగర్ వైపు వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు లేకపోవడంతో ఇబ్బందులు తెలెత్తుతుందని వాపోతున్నారు.



గణేశ్ టెంపుల్ రోడ్డులో నిలచిపోయిన వాహనాలు

ఘనంగా పడిపూజ



మొయినాబాద్‌రూరల్: పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు



షాద్‌నగర్: బక్కని నర్సింలును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ గ్రామంలో శనివారం వినోద్‌కుమార్ గంట స్వామి, నవీన్ కుమార్ కత్తి స్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజను రాంచందర్ గురుస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పూలు, పండ్లు నూతన వస్త్రాలు సమర్పించి పడిపూజ చేశారు. కుమ్మరి శోభాసత్తయ్యలు స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వాములు మురళీ, రవీందర్, మహేందర్, మల్లేశ్‌యాదవ్, సతీష్‌గౌడ్, మల్లేష్‌ముదిరాజ్, అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో మెలగండి: బక్కని నర్సింలు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. సోలీపూర్ గ్రామ శివారులోని చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయంలో వ్యాపారవేత్త ఎల్ కుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. భక్తి భావంతోనే మనస్సును ఏకాగ్రతతో ఉంచుకోవచ్చన్నారు. ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గురుస్వామి సత్యనారాయణ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, కృష్ణ, ప్రమోద్, సునీల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలంగౌడ్, అన్మారి వెంకటయ్య పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మండల పరిధిలోని పారిశ్రామిక వాడలో అయ్యప్ప ఆలయంలో స్వాములకు అన్నదానం చేశారు. కొత్తూరు మండలం ఎస్బీపల్లికి చెందిన లింగారం సురేశ్‌గౌడ్ సహకారంతో అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరిజీవన్, సుదర్శన్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయం.. బస్టాండ్

- పటించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో జనం

షాబాద్: ఆర్టీసీ అధికారులు లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన బస్టాండు సమస్యలకు నిలయంగా మారింది. షాబాద్ మండల పరిధిలోని నాగరగూడ బస్టాండ్ నిర్వహణ లోపంతో సమస్యల్లో కూరుకపోయింది. ఇక్కడ బస్‌స్టేషన్‌లో కూర్చోవడానికి సీట్లు ఉండవు. బస్టాండ్ పూర్తిగా గుంతలుగా తయారైంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ బస్టాండ్‌కు పూడూర్ మండలం కడ్మూర్ నుంచి చేవెళ్ల మండలం దేవరంపల్లి నుంచి షాబాద్ మండలం హైతాబాద్ నుంచి 20 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ వస్తుంటారు. ప్రతిరోజు వందలాది మంది ఇక్కడి నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి 15సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక వర్షం పడిదంటే బస్టాండ్ పూర్తిగా బురదమయంగా మారుతుంది. ప్రయాణికులు నిలబడడానికి కూడా చోటు ఉండని పరిస్థితి దాపురిస్తుంది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రాకుండానే రోడ్లపైనే నిలబడుతున్నారు. మరుగుదొడ్లు నిర్వహణ సరిగా లేక దుర్గంధం వెదజల్లుతోంది. వాటిని ప్రయాణికులు ఎవరు ఉపయోగించడం లేదు. అసలే అరకొర సౌకర్యాలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ ప్రైవేట్ వాహనాలు ఆపుతుండడంతో స్థానికులకు ఇబ్బందికరంగా మారుతుందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నాగరగూడ బస్‌స్టేషన్



పాడవుతున్న మరుగుదొడ్లు



మినీ వాటర్ ట్యాంకు వద్ద చేరిన చెత్తాచెదారం